సాక్షి
శ్రీకాకుళం

శుక్రవారం । 23 । మే । 2025



మినీ మహానాడు వెలవెల

జిల్లా కేంద్రంలో నిర్వహించిన టీడీపీ మినీ మహానాడు వెలవెలబోయింది. జనాలు రాలేదు. - 10లో



సర్కారు వారి జాగాలో..

కవిటిలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణ జరుగుతోంది. అధికారులు పట్టించుకోవడం లేదు. - 10లో

లక్ష మొక్కల పెంపకమే టార్గెట్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాను హరిత జిల్లాగా మార్చేందుకు భారీ చర్యలు చేపట్టామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. లక్ష మొక్కలు నాటేందుకు టార్గెట్ నిర్ణయించామని ఆయన వెల్లడించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జిల్లా అధికారుల సమావేశంలో మాట్లాడిన ఆయన... మొక్కలు పెంచేందుకు తగిన ప్రదేశాలను గుర్తించాలని అటవీ, ఇరిగేషన్ అధికారులకు సూచించారు.


● హనుమా.. మము గనుమా





జై హనుమాన్ నినాదాలతో దారులు దద్దరిల్లాయి. కాషాయ జెండాలతో రహదారులు కళకళలాడాయి. హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం శ్రీకాకుళంలో శోభాయాత్ర వైభవంగా జరిగింది. విశ్వహిందూ పరిషత్, భజరంగదళ్ సభ్యుల పిలుపుమేరకు 80అడుగుల రోడ్డు నుంచి పట్టణమంతా శోభాయాత్ర నిర్వహించారు. – శ్రీకాకుళం కల్చరల్

● సూక్ష్మ రూపధారి..





ఆంజనేయగద, శ్రీరామనామం

హనుమాన్ జయంతి సందర్భంగా సూక్ష్మ కళాకారుడు కొత్తపల్లి రమేష్ ఆచారి హనుమంతుని గద, రామబాణం తయారు చేశారు. పలుచటి బంగారపు రేకు పైన ఎలాంటి అతుకులు లేకుండా రెండు గంటలు కష్టపడి చిన్న గద, బుల్లి రామబాణం తయారు చేశారు. –కాశీబుగ్గ

న్యూస్‌రీల్

బొడ్డపాడుపై పోలీసు నిఘా

పలాస: పలాస మండలం బొడ్డపాడుపై పోలీసులు నిఘా పెట్టారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శి నంబాళ్ల కేశవరావు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారని వార్త వచ్చిన వెంటనే బుధవారం సాయంత్రానికి బొడ్డపాడు గ్రామానికి పోలీసులు చేరుకున్నారు. కేశవరావు మృత దేహాన్ని తీసుకు రావడానికి గ్రామం నుంచి వెళ్తున్నారా అని స్థానిక పోలీసులు గ్రామస్తులను అడగడంతో ఆయన తమ గ్రామానికి చెందిన వ్యక్తి కాదని, రాజకీయ బంధుత్వం మాత్రమే ఉందని చెప్పి పోలీసులను తిరిగి పంపించేశారు. ఈ నేపథ్యంలోనే కేశవరావు గ్రామం నుంచి అతని బంధువులు, కొంతమంది మాజీ మావోయిస్టులు అతని మృతదేహాన్ని తీసుకుని రావడానికి వెళ్లారు. కానీ వారికి కేశవరావు మృతదేహం చూపించలేదని సమాచారం. బొడ్డపాడులో మాత్రంలో బుధవారం సాయంత్రం నుంచి గురువారం రాత్రివరకు పోలీసులు మఫ్టీలో సంచరించారు. అలాగే కేశవరావు ఎన్‌కౌంటర్‌ను సీపీఐఎంఎల్ లిబరేషన్ నాయకులు ఖండిస్తున్నారు. జిల్లాకు చెందిన ఆ పార్టీ సీనియర్ నాయకులు మద్దిల మల్లేశ్వరరావు, తామాడ సన్యాసిరావు, మద్దిల రామారావు, కుత్తుం దుష్యంత్, పోతనపల్లి కామేశ్వరరావు తదితరులు ఒక ప్రకటనలో ఖండించారు.

గర్భిణుల ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: గర్భిణులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. మే 22వ తేదీని 'ప్రీ-ఎక్లాంప్సియా దినోత్సవం'గా ప్రకటించడంతో, జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన అవగాహన కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. గర్భిణులను ముందుగానే గుర్తించి, రక్తహీనత, గర్భధారణ డయాబెటిస్, సిఫిలిస్, హిమోగ్లోబిన్ స్థాయి, హెచ్‌ఐవీ, క్షయరోగం వంటి అన్ని పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. తీవ్ర తలనొప్పి, చూపు మార్పులు, పొత్తి కడుపు నొప్పి, మూత్ర విసర్జన తగ్గడం వంటి ఎక్లాంప్సియా సంకేతాలపై గర్భిణులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ సమస్యలకు అవసరమైన చికిత్స సామగ్రి అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

3613 మందికి తప్పనిసరి బదిలీ

శ్రీకాకుళం న్యూకాలనీ: పాఠశాల విద్యాశాఖలో బదిలీల పర్వంలో భాగంగా 3613 మంది టీచర్లకు తప్పనిసరి బదిలీలు కానున్నారు. వీరితోపాటు మరో 567 చోట్ల ఖాళీగా ఉన్న పోస్టులను బదిలీల ద్వారా భర్తీ చేయనున్నారు. వీటితోపాటు రిక్వెస్ట్ బదిలీలకు కూడా పాఠశాల విద్యాశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో జిల్లాలో కనీసం 6వేల మంది వరకు టీచర్లు దరఖాస్తు చేయవ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

జల్సాలపై మోజు.. మోసాలే రివాజు



- ఆగని నాగరాజు నకిలీ ఆటలు
- సీఎం, మంత్రుల ఓఎస్డీల పేరుతో మోసాలు
- తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఓఎస్డీ పేరుతో మోసం
- ఫిర్యాదులతో రంగంలోకి దిగిన హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు
- తాజాగా శ్రీకాకుళంలో అరెస్టు చేసి తీసుకెళ్లిన వైనం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జల్సాలకు అలవాటు పడి మోసాలకు పాల్పడుతున్న జిల్లాకు చెందిన మాజీ రంజీ క్రికెటర్ బుడుమూరు నాగరాజు తీరు మారలేదు. విలాసవంతమైన జీవితం కోసం నకిలీ ఆటలు ఆడుతూ పోలీసులకు దొరికిపోతున్నాడు. జైలుకు వెళ్లడం, బెయిల్‌పై బయటకు రావడం, మళ్లీ మోసాలకు పాల్పడడం అతడికి అలవాటుగా మారిపోయింది. తాజాగా నాగరాజు మరోసారి బుసకొట్టాడు. ఈసారి తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఓఎస్డీ పేరుతో హై ప్రొఫైల్ వ్యక్తులకు మెసేజ్‌లు పెట్టి డబ్బులు గుంజే ప్రయత్నం చేశాడు. కొందరు చేసిన ఫిర్యాదుతో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు గురువారం జిల్లాకువచ్చి అరెస్టు చేసి పట్టుకెళ్లిపోయారు.

విలాసాలకు అలవాటుపడి..

అడ్డగోలుగా సంపాదించాలన్న దుర్బుద్ధితో నాగరాజు వరుస నేరాలకు పాల్పడుతున్నాడు. పలుమార్లు అరెస్టై ఊచలు లెక్కి పెట్టినా అతడిలో మార్పు రావడం లేదు. బ్లాక్ మెయిల్, మోసాలు చేసి సంపాదించడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. పోలాకి మండలం యవ్వారిపేటకు చెందిన నాగరాజు ఎంబీఏ పూర్తి చేశాడు. క్రికెటర్‌గా రాణించాడు. రంజీలో ఆంధ్రా తరఫున ఆడాడు. ఆటగాడిగా మంచి భవిష్యత్‌తో ముందుకెళ్లాల్సిన నాగరాజు లగ్జరీలకు అలవాటు పడి, వ్యసనాలకు లోనై తన క్రీడా జీవితాన్ని నాశనం చేసుకోవడమే కాకుండా జిల్లా పరువును తీసేస్తున్నాడు. శ్రీకాకుళం జిల్లా వాసిగా మోసాలకు పాల్పడి ఎప్పటికప్పుడు అడ్డంగా బుక్ అయిపోతున్నాడు.

ప్రముఖుల పేరు చెప్పి..


గతంలో తెలంగాణ మాజీ మంత్రి కేటీఆర్ వ్యక్తిగత కార్యదర్శి పేరు చెప్పి ఓ ఫార్మా కంపెనీకి టోకరా పెట్టాడు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నప్పుడు ఆయన పీఏ పేరు చెప్పి ఓ సెల్‌ఫోన్ విక్రయ కంపెనీని మోసం చేయబోయి పోలీసులకు చిక్కాడు. గత ఏడాది సీఎం చంద్రబాబునాయుడు ఓఎస్డీ పేరు చెప్పి మోసాలకు పాల్పడి అరెస్టయ్యాడు. తాజాగా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఓఎస్డీ పేరు ర్యాపిడో, కంట్రీ డిలైట్ ఎండీలకు ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేశాడు. అలాగే, పలు రియల్ ఎస్టేట్ కంపెనీలకు మెసెజ్‌లు పెట్టి భారీగా డబ్బులు అడిగాడు. హైదరాబాద్, ముంబై తదితర కీలక నగరాల్లోని హై ప్రొఫైల్ వ్యక్తులను టార్గెట్ చేసి డబ్బులు గుంజుకునే ప్రయత్నం చేస్తున్నాడు. దాదాపు ప్రతి కేసులో అరెస్ట్ అవుతున్నాడు. బెయిల్‌పై వచ్చి మళ్లీ మోసాలకు పాల్పడుతున్నాడు.



మాజీ క్రికెటర్ బుడుమూరు నాగరాజు

గంజాయి సరఫరా చేస్తూ..

2023 జూలైలో శ్రీకాకుళం జిల్లాలో గంజాయి సరఫరా చేస్తూ పట్టుబడ్డాడు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలు అనేకం చేస్తున్నాడన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. తరచూ అరెస్టై ఊచలు లెక్క పెడుతున్నా ఆయనలో ఏ మాత్రం మార్పు రావడం లేదు. మోసాలు చేసి డబ్బులు సంపాదించడమే అలవాటుగా చేసుకుని బతికిపోతున్నాడు. పలువురు క్రికెటర్లకు స్పాన్సర్స్ పేరుతో పెద్ద పెద్ద వ్యక్తుల ఫొటోలను డీపీలుగా పెట్టుకుని మోసాలకు పాల్పడుతున్నాడు. చాలా మంది ఇతడి మోసాలకు బలైపోయారు. కొందరు అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పట్టుబడి జైలుకు వెళ్తున్నాడు.



లంచగొండి ఇన్‌స్పెక్టర్ ఆటకట్టు

- పలాస తూనికలు కొలతల కార్యాలయంలో ఏసీబీ దాడులు
- రూ.1.78 లక్షలు లంచం తీసుకుంటూ దొరికిన తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పలాస మండలం తూనికలు కొలతల కార్యాలయంలో గురువారం ఆ శాఖ అధికారి లంచం తీసుకుంటూ దొరికిపోయారు. వివరాల్లోకి వెళితే.. పలాస తూనికలు కొలతల శాఖ కార్యాలయంలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న శ్రీధర్ ప్రభుత్వ లైసెన్స్ పొందిన రిపేరర్స్ వద్ద రూ.1.78 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి తన సిబ్బందితో కలిసి దాడి చేసి పట్టుకున్నారు. జిల్లాలో పద్నాలుగు మండలాలకు ఈయన ఒక్కరే ఇన్‌స్పెక్టర్ కావడంతో అన్ని ప్రాంతాలు తిరగడానికి వీల్లేక.. ప్రతి మండలానికి ఇద్దరు చొప్పున ఎలక్ట్రానిక్ వెయింగ్ మిషన్‌లు మరమ్మతులు చేసే ప్రభుత్వ లైసెన్సు పొందిన వ్యక్తులను పెట్టుకుని వారి ద్వారా అదనంగా నగదు వసూలు చేస్తూ వస్తున్నారు. ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్‌లు పనిచేస్తున్నట్లు తనిఖీలు చేసి సీలు వేసి సర్టిఫికెట్ ఇవ్వాల్సి ఉంటుంది. ఆ సర్టిఫికెట్ ఇవ్వాలంటే ప్రభుత్వానికి రూ.300 చలానా తీయాలి. అయితే దీంతో పాటు రూ.400 అదనంగా తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇవ్వకపోతే పదే పదే తనిఖీల పేరుతో ఇబ్బందులు పెడుతున్నారు. దీంతో కొందరు వ్యాపారులు ఏసీబీ అధికారులను సంప్రదించారు. మొత్తం 441 మంది వ్యాపారుల వద్ద ఏడాదికి సర్టిఫికెట్ కోసం రూ.1.78 లక్షలు తన సిబ్బంది నుంచి తీసుకుంటూ ఉండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి మాట్లాడుతూ వ్యాపారుల వద్ద అక్రమంగా వసూలు చేసిన నగదు తీసుకుంటుండగా పట్టుకున్నామని, కేసు నమోదు చేసి ఏసీబీ కోర్టుకు తరలిస్తున్నామని వెల్లడించారు.



ఏసీబీకి పట్టుబడిన శ్రీధర్. చిత్రంలో ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి

రోడ్డెక్కిన ఆఫ్‌షోర్ నిర్వాసితులు

మెళియాపుట్టి: మండలంలోని రేగులపాడు ఆఫ్‌షోర్‌కు గ్రామాన్నిచ్చిన చీపురుపల్లి నిర్వాసితులు గురువారం రోడ్డెక్కి నిరసన తెలిపారు. అక్కడే నిరాహార దీక్ష చేపట్టారు. పలువురు నిర్వాసితులు మాట్లాడుతూ.. హిరమండలం నిర్వాసితులకు ఇచ్చిన 460 జీఓ ప్రాప్తికి పూర్తిస్థాయి ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. వలస వెళ్లిన 132 మంది నిర్వాసితులకు ప్యాకేజీలు ఇవ్వలేదన్నారు. నిర్వాసితులందరికీ అంత్యోదయ కార్డులు మంజూరు చేయాలని, డీ పట్టా భూములకు సొమ్ములు చెల్లించాలని, చెల్లింపుల్లో తేడాలు ఉన్నాయని వాటిని సవరించి ఇళ్లకు పరిహారం చెల్లించాలన్నారు. పలాస మండలం గోపీవల్లభపురం, టెక్కలిపట్నంలో నిర్వాసితులకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టినప్పటికీ అక్కడ మౌలిక సదుపాయాలు లేవని, శ్మశాన వాటికలు, ప్రభుత్వ భవనాలు, రోడ్లు, తాగునీటి సదుపాయం లేదని అన్నారు. అన్ని సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు దీక్షలు కొనసాగుతాయన్నారు.



రేగులపాడు ఆఫ్‌షోర్ నిర్వాసితుల ఆందోళన

కుటుంబం ఆత్మహత్యాయత్నం

- పోలీసుల వేధింపులు తట్టుకోలేకేనని ప్రచారం
- శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న కుటుంబ సభ్యులు



108 వాహనంలో ఆస్పత్రికి వెళ్తున్న పురుగు మందు తాగిన కుటుంబ సభ్యులు

ఎచ్చెర్ల క్యాంపస్/గార: ఎచ్చెర్ల మండలంలోని ధర్మవరం గ్రామం గురువారం ఉలిక్కిపడింది. గ్రామానికి చెందిన ఎండ మోహనరావు, భార్య రేణుక, కుమార్తె అంజలి పురుగు మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడడంతో ఊరిలో కలకలం రేగింది. కుమారుడు చేసిన తప్పునకు వీరు ముగ్గురు శిక్ష అనుభవిస్తున్నారని, పోలీసుల వేధింపులు కూడా ఓ కారణమేనని స్థానికంగా చర్చ జరుగుతోంది. పూర్తి వివరాల్లోకి వెళితే.. ఎచ్చెర్ల మండలం ధర్మవరం గ్రామానికి చెందిన ఎండ మోహనరావు, భార్య రేణుక, కుమారుడు చందు, కుమార్తె అంజలి పదేళ్ల క్రితం శ్రీకాకుళం పట్టణానికి బతుకు తెరువు కోసం వెళ్లిపోయారు. ప్రతి నెల రేషన్ కోసం వస్తున్నారు. ఎన్నికలు, పండగలు వంటి సమయంలో వచ్చి మళ్లీ వెళ్లిపోతుంటారు. ప్రస్తుతం శ్రీకాకుళం పట్టణంలోని గుజరాతీపేట సమీపంలో ఇల్లు అద్దెకు తీసుకొని జీవనం సాగిస్తున్నారు. మోహనరావు శ్రీకూర్మంలోని ఓ దాబాలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. రేణుక కూలి పనులు చేస్తుంటారు. కుమార్తె అంజలికి మానసిక సమస్యలు ఉన్నాయి. కుమారుడు చందు విజయవాడలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. గత నెల చందు విజయవాడలో ఓ బాలికతో పరారైపోయాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ కోసం కుటుంబ సభ్యులను పోలీసులు విజయవాడ తీసుకెళ్లి.. విచారణ అనంతరం అక్కడే వదిలేసేవారు. మాటిమాటికీ ఇలా వెళ్లిరావడం ఈ కుటుంబానికి తలకుమించిన భారమైంది. రవాణా ఖర్చులు సైతం ఇబ్బందిగా మారాయి. దీంతో ఊరిలోని పెద్దలను కలిశారు. వారు కూడా ఏమీ చేయలేమంటూ చేతులెత్తేశారు. కుమారుడి నుంచి కూడా ఎలాంటి సంప్రదింపులు లేవు. దీంతో వారు ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించారు.

గురువారం మధ్యాహ్నం తల్లిదండ్రులు కుమార్తెతో కలిసి శ్రీకాకుళం పాతబస్టాండ్ సమీపంలో ఆటో ఎక్కి గార మండలం వత్సవలస వద్ద దిగారు. అక్కడ పొలాల్లోకి వెళ్లి తమ వెంట తెచ్చుకున్న పురుగు మందు తాగేశారు. తాగాక 108కు వారే ఫోన్‌చేసి పరిస్థితి వివరించారు. దీంతో వీరిని అంబులెన్స్‌లో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్చారు. ప్రాథమికంగా ప్రాణహాని లేనట్లు వైద్య వర్గాలు తెలిపాయి. వీరి నుంచి ఔట్ పోస్టు పోలీసులు స్టేట్‌మెంట్ తీసుకున్నారు. ఆస్పత్రి వర్గాల సమచారం మేరకు గార పోలీసులు కూడా కేసు నమోదు చేశారు.

బాల్యానికి రంగులు..



చిత్రాన్ని గీస్తున్న విద్యార్థిని



ఒకరి కాగితంపై మిక్కీ మౌస్ అందంగా నవ్వుతూ ఉంటుంది. మరొకరి పేపర్‌పై రోజా పువ్వు భలే నాజూగ్గా కనిపిస్తుంది. ఇంకొకరి కాన్వాస్‌పై మూడు రంగుల జెండా మెరిసిపోతూ ఉంటుంది. వేసవి సెలవుల్లో జిల్లా కేంద్రంలోని లాఫింగ్ క్లబ్ బాల్యానికి రంగులు అద్దుతోంది. ఆసక్తి గల చిన్నారులకు బొమ్మలు వేయడం నేర్పుతోంది. వేసవి సెలవుల్లో అందివచ్చిన అవకాశాన్ని చిన్నారులు కూడా రెండు చేతులా అందిపుచ్చుకుంటున్నారు.

- వేసవి సెలవుల్లో లాఫింగ్ క్లబ్ 'గీతా' బోధన
- డ్రాయింగ్‌తో పాటు సంగీతం, పెయింటింగ్‌లో కూడా ఉచిత శిక్షణ

శ్రీకాకుళం కల్చరల్:

జిల్లా కేంద్రంలోని లాఫింగ్ క్లబ్ వేసవిలో చిన్నారుల అడ్డాగా మారింది. ఇష్టమైన వ్యాపకాలపై ఇక్కడ శిక్షణ ఇస్తుండడంతో పిల్లలు తమ అభిరుచి మేరకు నేర్చుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు. లోకనాథం నందికేశ్వరరావు, బీఎంఎస్ పట్నాయిక్ అనే ఇద్దరు టీచర్లు వేసవి శిక్షణ శిబిరాలను పుష్కర కాలం కిందట కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న తమ ఇంటి వద్ద ప్రారంభించారు. ప్రస్తుతం విద్యార్థులు పెరుగుతున్నందున అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. చిన్నారులకు ఉచితంగా డ్రాయింగ్ వేయడం నేర్పుతున్నారు. ఒక్క డ్రాయింగ్‌లోనే కాకుండా పేపర్ క్విల్లింగ్, కూచిపూడి నృత్యం, సంగీతం, పెయింటింగ్‌పై శిక్షణలు ఇవ్వడం ప్రారంభించారు. ఏటా అన్ని విభాగాల్లో కలిపి మొత్తంగా 200 మంది చిన్నారులు వారి అభిరుచి మేరకు నేర్చుకుంటున్నారు. వీరిలో కొంతమంది ఉద్యోగాలను కూడా సాధించారు. చిల్డ్రన్స్ లాఫింగ్ ద్వారా నేషనల్ స్థాయిలో పలు అంశాలపై పోటీలు నిర్వహించగా ఇద్దరు బహుమతులు సాధించారు. 40 మంది మెడల్స్, సర్టిఫికెట్లు సాధించారు. నందికేశ్వరరావు, పట్నాయక్‌తో పాటు దుర్గా ప్రసాద్, సాయి ప్రసాద్, దీప్తి కూడా తమ సేవలను అందిస్తున్నారు.

చిన్నారులకు పేపర్ క్విల్లింగ్‌లో శిక్షణ



డ్రాయింగ్ అంటే ఇష్టం



నాకు డ్రాయింగ్ అంటే ఇష్టం. నేను రోజూ డ్రాయింగ్ తరగతులకు వేసవి సెలవుల్లో వస్తాను. నేను బాగా బొమ్మలు వేయడం నేర్చుకున్నాను.

– భరత్, 9వ తరగతి, శ్రీకాకుళం

విశ్రాంత జీవితం ఆనందంగా ఉంది



మాకు వచ్చిన విద్యను చిన్నారులకు నేర్పడం ఎంతో తృప్తిగా ఉంది. ముఖ్యంగా చిన్నారులకు వినోదం కలిగించడమే మా ధ్యేయం. విజ్ఞానం కూడా అందిస్తున్నాం. దీని వల్ల విశ్రాంత జీవితం ఆనందంగా ఉంది.

– ఎల్.నందికేశ్వరరావు, రిటైర్డ్ డ్రాయింగ్ టీచర్

ఈ వయసులో అవకాశం



నా మిత్రుడు నందికేశ్వరరావు పిలుపు మేరకు నా టాలెంట్‌ను కూడా నలుగురికి పంచాలని అతనికి చేదోడుగా నిలిచాను. ఇది నాకు ఎంతో ఆనందాన్ని ఇస్తోంది. రాబోయే తరానికి మంచి విషయాలు నేర్పడం వల్ల మంచి పౌరులుగా మారుతారు.

– బీఎంఎస్ పట్నాయిక్, రిటైర్డ్ డ్రాయింగ్ టీచర్

సహకరిస్తున్నాను



చిన్నారులంటే నాకు చాలా ఇష్టం. వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీయడం మా ఉద్దేశం. లాఫింగ్ క్లబ్‌కు నా వంతు సహకారం అందిస్తున్నాను. చిన్నారుల బాల్యానికి మెరుగులు దిద్దుతున్న ఇద్దరు స్నేహితులకు అండగా ఉంటున్నాను.

– నటుకుల మోహన్, క్లబ్ నిర్వాహకులు

క్లుప్తంగా

కొనసాగుతున్న ఏపీ ఈఏపీసెట్ పరీక్షలు



శివానీలో విద్యార్థుల హాల్ టిక్కెట్లు పరిశీలిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలో ఏపీ ఈఏపీ సెట్ -2025 పరీక్షలు కొనసాగుతున్నాయి. ఎచ్చెర్ల మండల పరిధిలో రెండు పరీక్ష కేంద్రాల్లో గురువారం రెండు షిఫ్టుల్లో పరీక్షలు నిర్వహించారు. చిలకపాలెంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజీలో మొదటి షిఫ్టులో 279 మందికి 270, రెండో షిఫ్టులో 280 మందికి 265 మంది, ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజీలో మొదటి షిఫ్టులో 169 మందికి 162, రెండో షిఫ్టులో 170 మందికి 164 మంది హాజరయ్యారు. పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తున్నారు.

మానవత్వం చాటుకున్న బ్యాంకు ఉద్యోగి



గోవిందకు పర్సును అందజేస్తున్న అప్పలనాయుడు

రణస్థలం: మండలంలోని పతివాడపాలెం గ్రామానికి చెందిన బొంతు అప్పలనాయుడు అనే బ్యాంకు ఉద్యోగి మానవత్వం చాటుకున్నాడు. బుధవారం చీపురుపల్లి మండలంలోని కర్లాం గ్రామదేవత పండుగకు వెళ్లిన అతనికి ఒక పర్సు దొరికింది. అందులో రూ.16,500 నగదు, ఆధార్, పాన్‌కార్డు, ఓటర్, డ్రైవింగ్ లైసెన్సు కార్డులతో పాటు వివిధ ఏటీఎంలు ఉన్నాయి. అందులో వివరాలు ప్రకారం ముద్దాడ గోవింద అనే వ్యక్తిగా గుర్తించి ఆయనకు సమాచారం అందించారు. అతను గురువారం రణస్థలం రావడంతో పోగొట్టుకున్న పర్సును అప్పలనాయుడు అందజేశారు. మానవత్వం చాటుకున్న బ్యాంకు ఉద్యోగి అప్పలనాయుడును స్థానికులందరూ ప్రశంసించారు.

హైదరాబాద్‌లో గూనభద్ర వాసి మృతి



నక్క శ్రీనివాసరావు (ఫైల్)

కొత్తూరు: కొత్తూరు మండలం గూనభద్రకు చెందిన నక్క శ్రీనివాసరావు(41) హైదరాబాద్‌లో గురువారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఆయన కుటుంబంతో పాటు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నారు. ఒక ఇంటిలో ఎలక్ట్రికల్ పనులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య కృష్ణకుమారి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శ్రీనివాసరావు మృతి చెందడంతో గూనభద్ర గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. శ్రీనివాసరావు మృతదేహాన్ని స్వగ్రామం గూనభద్ర తీసుకు వస్తున్నారు.

చిత్రలేఖనం పోటీల్లో బ్రాహ్మణతర్లా విద్యార్థికి ప్రథమ స్థానం

పలాస: విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం పురస్కరించుకొని గురువారం నిర్వహించిన రాష్ట్ర జీవ వైవిధ్య సదస్సులో పలాస మండలం బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాలకు చెందిన సైన్సు ఉపాధ్యాయుడు నేషనల్ గ్రీన్ కోర్ క్లస్టర్ కోఆర్డినేటరు కొయ్యల శ్రీనివాసరావు మార్గదర్శకత్వంలో విద్యార్థులు పాల్గొన్నారు. 'ప్రకృతితో సామరస్యం స్థిరమైన అభివృద్ధి' అనే అంశంపై చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఇంజినీరింగ్ విభాగంలో పుచ్చ అక్షర కుమార్ ప్రథమ స్థానం సాధించాడు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేతులు మీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర జీవ వైవిధ్య మండలి చైర్మన్ ఎస్.విజయకుమార్, మెంబర్ సెక్రటరీ పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు వారి జాగాలో..



ఎస్‌కేఈ రోడ్డులో విశ్రాంతి భవనాన్ని విరగ్గొట్టి కడుతున్న అక్రమ నిర్మాణం

- ఎస్‌కేఈ రోడ్డు పక్కనే కూటమి నేత అక్రమ నిర్మాణాలు
- కనీస నిబంధనలు పాటించని వైనం
- నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికార యంత్రాంగం

కవిటి: అధికారంలోకి వచ్చాక కూటమి నాయకులకు ప్రభుత్వ స్థలాలు కూడా సొంత జాగాలైపోతున్నాయి. మొన్నటికి మొన్నే రాజపురం వెళ్లే మార్గంలో ప్రభుత్వ స్థలాన్ని మట్టివేసి చదును చేయించి కాజేసే ప్రయత్నం చేశారు. ఆ సంగతి మరువక ముందే మళ్లీ సోంపేట-కవిటి-ఈదుపురం (ఎస్‌కేఈ రోడ్డు) పక్కనే మరో టీడీపీ నాయకుడు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణం చేపడుతున్నారు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎస్‌కేఈ రోడ్డు నుంచి నెలవంక వెళ్లే రోడ్డు మలుపులో పంచాయతీ విశ్రాంతి భవనానికి ఆనుకునే ఓ అక్రమ నిర్మాణానికి ఓ టీడీపీ నేత పూనుకున్నాడు. వాస్తవానికి గతంలోనూ ఇలాగే ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఓ భవనం కట్టేశాడు. సుడా అనుమతులు కూడా తీసుకోకుండా కరెంటు కనెక్షన్ కూడా తెప్పించుకున్నాడు. తాజాగా ఇప్పుడు విశ్రాంతి భవనానికి ఉద్దానం మంచినీటి పథకం ఓవర్ హెడ్ ట్యాంకుకు మధ్యన ఉన్న తన స్థలంలో ప్రభుత్వ స్థలం కలిపేసి నిర్మాణం చేసేందుకు పనులు ప్రారంభించేశాడు. పనుల్లో భాగంగా ఇక్కడున్న మర్రిచెట్టును కూల్చగా.. దాని కింద ఉన్న ఉద్దానం నీటిపథకం పైప్‌లైన్ ధ్వంసమైంది. దీంతో ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ సొంత ఊరు (జంట గ్రామాలు) ప్రగడ పుట్టుగ, రామయ్య పుట్టుగలకు నీటిసరఫరా ఆగిపోయింది. విషయం తెలుసుకున్న పంచాయతీ అధికారులు హుటాహుటిన నష్టనివారణ చర్యలు చేపట్టారు. పైప్‌లైన్ బాగుచేసే పనులు చేయిస్తావా లేక పోలీసులకు ఫిర్యాదు చేయమంటావా అంటే మరమ్మతులు పనులు చేయించాడు.

దీంతో ఆ సమస్య సద్దుమణిగింది. కానీ అక్రమ నిర్మాణం మాత్రం ఒకటి పూర్తి కావచ్చింది. ఇక్కడ వ్యవసాయ భూమిని వాణిజ్య అవసరాలకు వినియోగించినా నాలా కన్వర్షన్ చేసుకోలేదు. అయినా అధికారులు కిమ్మనడం లేదు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



ఎస్‌కేఈ రోడ్డులో ప్రభుత్వ స్థలం ఆక్రమించి చేసిన నిర్మాణం

దరఖాస్తులు లేవు

ఎస్‌కేఈ రోడ్డులో వ్యవసాయ భూమిలో వ్యవసాయేతర అవసరాలకు ఉద్దేశించి వినియోగించే నిమిత్తం రైతుల నుంచి కానీ, నిర్మాణదారుల నుంచి కానీ నాలా కన్వర్షన్ కోసం దరఖాస్తులు అందలేదు. ఆ స్థలంలో వ్యవసాయ భూమిలో ఏవైనా కట్టడాలు కడితే నిబంధనలకు విరుద్ధంగా ఉంటే శాఖాపరమైన చర్యలకు సిఫారసు చేసే వ్యక్తులకు నోటీసులు జారీ చేస్తాం.

– ఎస్.నారాయణ, వీఆర్‌ఓ, కవిటి రెవెన్యూ

అనుమతులు లేవు..



ఎస్‌కేఈ రోడ్డుకు అనుకుని ఉన్న స్థలాల్లో ప్రగడపుట్టుగ జంక్షన్ విశ్రాంతి భవనం పక్కన కట్టిన నిర్మాణాలకు సుడా అనుమతుల కోసం ఎలాంటి దరఖాస్తులు రాలేదు. నిర్మాణదారుకు నిబంధనలను అనుసరించి శాఖాపరమైన చర్యలు ఎందుకు తీసుకోకూడదో తెలపాలంటూ నోటీసులు జారీ చేస్తాం.

– జి.వీరభద్రస్వామి, కవిటి పంచాయతీ ఈఓ

ఎక్కడి పనులు అక్కడే ఆపండి..

- ఎమ్మెల్యే ప్రైవేటు పీఏ అక్రమ నిర్మాణం
- పరిశీలించిన అధికారులు



ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీఓ, ఈఓలు

నరసన్నపేట: స్థానిక శివనగర్ కాలనీలో జోగి చెరువు గర్భాన్ని ఆక్రమించి స్థానిక ఎమ్మెల్యే ప్రైవేటు పీఏ రావాడ గణపతి చేపట్టిన అక్రమ నిర్మాణ పనులను అధికారులు గురువారం పరిశీలించి అడ్డుకున్నారు. జోగి చెరువు గర్భాన్ని ఆక్రమించుకొని స్థానికులు అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నారని 'సాక్షి'లో వరుస కథనాలు వచ్చాయి. అయితే ఈ నిర్మాణం ఎమ్మెల్యే ప్రైవేటు పీఏ రావాడ గణపతి చేస్తుండటంపై శివనగర్ వాసులు అధికారులకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేయడంతో గురువారం తహసీల్దార్ టి.సత్యనారాయణ, ఎంపీడీఓ బి.మధుసూదనరావు, ఈఓ ద్రాక్షాయిని, వీఆర్వో అలేఖ్య తదితరులు అక్రమ నిర్మాణాన్ని పరిశీలించారు. సుమారు రూ. కోటి విలువ చేసే ఈ స్థలాన్ని ఆక్రమించి తన సోదరుడితో పాటు తనకూ సరిపోయే విధంగా ఇళ్లు కట్టుకుంటున్నారు. దీన్ని పరిశీలించిన అధికారులు అవాక్కయ్యారు. స్పష్టంగా చెరువు గర్భం కనిపిస్తుండడంతో పంచాయతీ నుంచి ప్లాన్ అప్రూవల్ తీసుకున్నారా అని రావాడ గణపతి అన్నయ్యను ప్రశ్నించారు. 40 ఏళ్ల నుంచి ఈ స్థలం తమ స్వాధీనంలో ఉందని ఆయన వివరించారు. ఆధారాలు చూపించాలని అధికారులు అడిగితే తెల్ల మొఖం వేశారు. ఆధారాలు చూపించేంత వరకు పనులు ఆపాల్సిందేనని తహసీల్దార్, ఎంపీడీఓలు రావాడ గణపతి అన్నయ్యకు చెప్పారు. పనులు కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా ఎమ్మెల్యే ప్రైవేటు పీఏ ఈ విధంగా అక్రమ నిర్మాణానికి పాల్పడడంపై శివనగర్ వాసులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కఠిన చర్యలు తీసుకోవాలని, చెరువును కాపాడాలని కోరుతున్నారు.

మినీ మహానాడు వెలవెల



జనం లేక వెలవెలబోతున్న మినీమహానాడు ప్రాంగణం

శ్రీకాకుళం: శ్రీకాకుళం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన మినీ మహానాడు వెలవెలబోయింది. సాయంత్రం 4గంటలకు ప్రారంభం కావాల్సిన మినీమహానాడును రెండు గంటల పాటు ఆలస్యంగా ప్రారంభించారు. జనాలు లేకపోవడంతో అప్పటికప్పుడు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. 6.30గంటలకు సభ ప్రారంభం కాగా 8.30గంటల వరకూ కొనసాగింది. కేంద్రమంత్రి వచ్చే సమయానికి ఆయనతో పాటు కొందరు కార్యకర్తలు, నాయకులు వస్తారని భావించినప్పటికీ అది కూడా జరగకపోవడంతో ఉన్న వారితోనే చర్చ ప్రారంభమైంది. కార్యాలయ ప్రాంగణంలో సగానికి పైగా కుర్చీలు ఖాళీగా ఉండిపోయాయి. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడులు మినీ మహానాడుకు గైర్హాజరయ్యారు. అలాగే ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీషలు సైతం సమావేశానికి హాజరుకాలేదు.

అర్ధరాత్రి చోరీ

- ఆరు తులాల బంగారం, పది తులాల వెండి దొంగతనం



పరిశీలిస్తున్న క్లూస్‌టీం

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం నగరంలోని గోవింద నగర్ కాలనీ గరుడాద్రి రోడ్డు ప్లాట్ నంబర్ 53లో నివాసం ఉంటున్న వెంకట సుబ్రహ్మణ్య గురునాథ్ ఇంటిలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. మరో రెండిళ్లలోనూ దుండగులు చోరీకి ప్రయత్నించారు. గురునాథ్ ఇంటిలోని బంగారం, వెండి దోచుకున్నారు. ఈయన శ్రీకాకుళం ఆర్అండ్‌బీ శాఖలోని డివిజనల్ అకౌంట్ అధికారిగా పనిచేస్తున్నారు. కుమార్తె పెళ్లి పనుల హడావుడిలో ఆయన ఈ నెల 17న కుటుంబ సభ్యులతో స్వస్థలం పశ్చిమగోదావరి వెళ్లారు. తాళాలు వేసి ఉన్న ఇంటిలోకి దొంగలు అర్ధరాత్రి ప్రవేశించి లూటీ చేశారు. గురువారం ఉదయం ఇంటికి వచ్చిన అధికారి ఇంటి డోర్ అన్‌లాక్ చేసి ఉండడంతో కంగారు పడి లోపలకు వెళ్లి చూడగా బీరువాలు సైతం తెరిచి ఉన్నాయి. బీరువాలోని బంగారం, వెండి పోయినట్లు గుర్తించి పక్కనే గల కాలనీవాసులకు విషయం తెలియపరిచాడు. బీరువాలో గల 6 తులాల బంగారంతో పాటు పది తులాల వెండి పోయినట్లు బాధితుడు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విషయం తెలుసుకున్న క్లూస్‌టీం సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదే కాలనీలో నివాసం ఉంటున్న బగాది అప్పారావుతో పాటు మరో ఇంటిలోకి కూడా దుండగులు ప్రవేశించారు. అక్కడ ఏమీ దొరక్క పోవడంతో బీరువాల్లో సామాన్లు చిందరవందరగా పడేసి వెళ్లిపోయారు.

బంగారం దుకాణంలో గొలుసుల చోరీ



దొంగతనానికి ముందు గొలుసు పరిశీలిస్తున్న గుర్తు తెలియని వ్యక్తి

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కేటీ రోడ్డులో ఉన్న తాళాసు నాన్నారావు బంగారు దుకాణంలో బుధవారం దొంగతనం జరిగింది. కాశీబుగ్గ పోలీసులు గురువారం విడుదల చేసిన సీసీ పుటేజీ ఆధారంగా.. ఓ గుర్తు తెలియని వ్యక్తి తాళాసు నాన్నారావు బంగారు దుకాణంలోకి టోపీ, మాస్కు పెట్టుకుని వచ్చాడు. బంగారం గొలుసు కావాలని అడగ్గా మూడు గొలుసులు అతడికి చూపించారు. అవి చూస్తున్నట్టుగా నటించి రెండు చైన్లను పట్టుకుని ఒక్కసారిగా పరిగెత్తాడు. షాపు నుంచి బయటకు వచ్చి షర్టు తీసేసి టీ షర్టుతో పరుగులు పెట్టినట్టు పుటేజీలో ఉంది. కాశీబుగ్గ పోలీసుస్టేషన్ ఎస్ఐ నర్సింగరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యోగా దినోత్సవానికి ప్రత్యేక కార్యాచరణ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 21న విశాఖపట్నంలో జరిగే ముఖ్య కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా నెల రోజుల పాటు గ్రామస్థాయి వరకు యోగా కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశమైన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఈ విషయాలను వెల్లడించారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రతి మండలానికి ఓ మాస్టర్ ట్రైనర్‌ను నియమించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా కేంద్రం, మండల కేంద్రాలతో పాటు ఇతర ప్రముఖ ప్రాంతాల్లో రోజువారీగా యోగా కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. ప్రతి జిల్లాకు ఒక ప్రత్యేకతతో యోగా కార్యక్రమం నిర్వహించనున్నారు. శ్రీకాకుళం జిల్లాలో మత్స్యకారులతో ఒకరోజు ప్రత్యేకంగా యోగా శిబిరం నిర్వహించనున్నట్టు తెలిపారు.

రక్తదానంతో నిరసన!



రక్తదానం చేస్తున్న ఆరోగ్య హెల్త్ మిషన్ అధికారుల

శ్రీకాకుళం పాతబస్టాండ్: వైద్యారోగ్య శాఖలోని జాతీయ హెల్త్ మిషన్ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్‌గా పని చేస్తున్న సిబ్బంది గత కొన్ని రోజులుగా నిరసనలు చేస్తున్నారు. గురువారం కూడా జిల్లా కేంద్రంలోని జ్యోతిరావు పూలే పార్కు వద్ద వినూత్నంగా నిరసన తెలిపారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించి తమ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీ బస్టాండ్‌లలో షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం జిల్లాలో గల ఆర్టీసీ బస్ స్టేషన్లలో షాపులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లాలో గల శ్రీకాకుళం 1, 2వ డిపోలు, టెక్కలి, పలాస తదితర డిపోల పరిధిలోకి వచ్చే ఆర్టీసీ బస్ స్టేషన్ల పరిధిలోని 66 షాపులలో అనుమతించిన వ్యాపారం నిర్వహించేందుకు, ఔత్సాహిక వ్యాపారవేత్తలు టెండర్ ఫారం ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 22 నుంచి 28వ తేదీలోగా శ్రీకాకుళం జిల్లాలో గల శ్రీకాకుళం 1, 2వ ఆర్టీసీ డిపోలతో పాటు టెక్కలి, పలాస డిపో మేనేజర్ల కార్యాలయాలలో టెండరు ఫారాలు అన్నీ పని దినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల్లోగా కొనుగోలు చేయవచ్చునని పేర్కొన్నారు. ఈ నెల 29వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలలోపు టెండర్ ఫారాలను టెండరు బాక్స్ లో వేయాలని, మధ్యాహ్నం 3 గంటలకు టెండరు దారుల సమక్షంలో బాక్సులను తెరుస్తారని తెలిపారు. ఆసక్తి గల వ్యాపారవేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

వ్యక్తిపై గృహహింస కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: కొయ్యాం పంచాయతీ కొత్తకుర్మినాయుడుపేట గ్రామానికి చెందిన బోర పైడిరాజుపై ఎచ్చెర్ల పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. తనను వేధిస్తున్నట్లు భార్య భారతి ఫిర్యాదు చేసింది. వీరికి పదేళ్ల క్రితం వివాహమైంది. రోజూ మద్యం తాగి కొట్టటం, హింసించటం చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొంది.

చనిపోయిన వృద్ధుని వివరాలు లభ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళంలోని సింహద్వారం సమీపంలో ఈ నెల 17న ఓ వృద్ధుడు అపస్మారక స్థితిలో పడి ఉండగా 108లో శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. ఆ వృద్ధుడు ఆస్పత్రిలో చనిపోయాడు. ఆయన వివరాలు గురువారం దొరికాయి. ఈ వ్యక్తిని సరుబుజ్జిలి మండలం గోనెపాడు గ్రామానికి చెందిన బిర్లంగి రామ్మూర్తిగా గుర్తించి, మృతదేహాన్ని బంధువులకు పోలీసులు అప్పగించారు.

ఏఎంసీలో మెడికో ఆత్మహత్య

దాబాగార్డెన్స్: ఆంధ్ర మెడికల్ కళాశాల(ఏఎంసీ) పీజీ హాస్టల్‌లో గురువారం ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలివి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన మోతీలాల్ (25) రేడియాలజీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కళాశాలలో చేరి కేవలం మూడు నెలలే అయింది. మెరిట్ విద్యార్థి అయిన మోతీలాల్ వ్యక్తిగత కారణాల వల్ల మృతి చెందాడని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. అయితే ప్రొఫెసర్ల వేధింపుల కారణంగానే అతను ఆత్మహత్య చేసుకున్నాడని అతని స్నేహితులు ఆరోపిస్తున్నారు. వన్‌టౌన్ పోలీసులు ఈ ఘటనపై వివరాలు సేకరిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రైలు ఢీకొని వృద్ధుడు మృతి



రైలు ఢీకొని మృతి చెందిన బి.మల్లేష్

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్డు ఆమదాలవలస రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం రైలు ఢీకొని బి.మల్లేష్ (79) అనే వృద్ధుడు మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం శ్రీకాకుళం మండలం తండేవలస గ్రామానికి చెందిన మల్లేష్ బమ్మిడివానిపేట రైల్వే గేటు వద్ద పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొన్నట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందారని తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులతో సాఫ్ట్‌బాల్ సంఘ ముఖ్య నాయకులు రవికుమార్, సూర శ్రీను, కలిదిండి తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ కమిటీ చైర్మన్ కూన రవికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఎస్ఎస్ఆర్ ట్రస్ట్ అధినేత సూర శ్రీనివాసరావు, కోశాధికారిగా జీవీ సత్యనారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శిగా మొజ్జాడ వెంకటరమణతోపాటు మిగిలిన కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శ్రీకాకుళం నగరంలోని క్రిస్టల్ ప్యాలెస్ వేదికగా పీడీ-పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు, సాఫ్ట్‌బాల్ సంఘ ముఖ్య ప్రతినిధి ఎంవీ రమణ అధ్యక్షతన గురువారం జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంతోపాటు నూతన కార్యవర్గ ఎన్నికలను నిర్వహించారు. ఆమదాలవలసలో ఉన్న స్టేడియాన్ని సాఫ్ట్‌బాల్ స్టేడియంగా రూపొందిస్తామని కూన తెలిపారు.

జిల్లా నూతన కార్యవర్గం..

సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా చైర్మన్‌గా కలిదిండి నరసింహారాజు, అధ్యక్షునిగా కూన రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా సూర శ్రీనివాసరావు, కన్వీనర్‌గా బడగల హరిధరరావు, కోశాధికారిగా జీవీ సత్యనారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శిగా మొజ్జాడ వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా ఎం.తిరుపతిరావు, బి.సురేష్, సంయుక్త కార్యదర్శులుగా ఏ.ఢిల్లేశ్వరరావు, ఎం.ఆనంద్‌కిరణ్, కార్యవర్గసభ్యులుగా పేడాడ బాబురావు, ఎస్వీ రమణ, డి.పెంటయ్య, ఎస్.రామరాజు, కె.వరలక్ష్మి, జి.దుర్గాప్రశాంతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

● 22 ఏళ్ల తర్వాత..



చిన్నప్పుడు ఒక్క చోటే చదువుకుని.. ఉన్నత చదువుల కోసం ఎక్కడెక్కడికో వెళ్లిపోయిన వారు 22 ఏళ్ల అనంతరం మళ్లీ కలిశారు. టెక్కలి మండలం పాతనౌపడ గ్రామంలో గల తలగాం ఎట్ నౌపడా ఆర్ఎస్ (తలగాం) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2002- 2003 బ్యాచ్ విద్యార్థులు గురువారం ఆత్మీయ కలయిక నిర్వహించారు. అప్పట్లో వారికి విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులను సాదరంగా ఆహ్వానించి సత్కరించారు. – టెక్కలి

రైలు నుంచి జారిపడి యువకుడు మృతి



మృతి చెందిన వెంకటేష్ (ఫైల్)



ర్యాలీగా వెళుతున్న చొర్లంగి గ్రామానికి చెందిన యువకులు

ఎల్ఎన్ పేట: మండలంలోని చొర్లంగి గ్రామానికి చెందిన అగతముడి వెంకటేష్ (23) రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. ఇందుకు సంబంధించి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటేష్ హైదరాబాద్‌లోని తన అక్క ఇంటికి వెళ్లేందుకు మంగళవారం రాత్రి ఫలక్‌నుమా రైలు ఎక్కాడు. మంగళవారం రాత్రి ఫలక్‌నుమా రైలు సుమారు నాలుగు గంటలకు పైగా ఆలస్యంగా వచ్చింది. అయితే ప్రమాదవశాత్తు విజయనగరం జిల్లా అంతకాపల్లి సమీపంలో వెంకటేష్ రైలు నుంచి జారి పడి మృతి చెందాడు. బుధవారం తెల్లవారు జామున స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందజేశారు. అక్కడి పోలీసులు గుర్తు తెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి విచారణ చేశారు. ఫలక్‌నుమా రైలు హైదరాబాద్ చేరుకున్న తర్వాత జనరల్ బోగీలో మిగిలి ఉన్న లగేజీ బ్యాగులను గుర్తించారు. అప్పటికే గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసిన విజయనగరం రైల్వే పోలీసులు లగేజీలో ఉన్న సమాచారం ప్రకారం వెంకటేష్ కుటుంబ సభ్యులకు గురువారం సమాచారం తెలియజేశారు. మృతుని తండ్రి తిరుపతిరావు ఇతర కుటుంబ సభ్యులు విజయనగరం చేరుకుని తన కొడుకేనని గుర్తించారు. గురువారం సాయంత్రం మృతదేహాన్ని గ్రామానికి తీసుకుని వచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

ఉద్యోగం సాధిస్తాడనుకుంటే..

మృతి చెందిన వెంకటేష్ బ్యాంక్ ఉద్యోగం సాధించేందుకు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. ఈ క్రమంలోనే నంద్యాలలో కోచింగ్ తీసుకుంటున్నాడు. వారం రోజుల కిందటే నంద్యాల నుంచి చొర్లంగి గ్రామానికి చేరుకున్నాడు. ఇటీవల జరిగిన బ్యాంక్ పరీక్షల్లో ఉత్తీర్ణుడయ్యాడని, ఇంటర్వ్యూ ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. మరి కొన్ని రోజుల్లో ఉద్యోగం వస్తుందనుకున్నంతలోనే ఇలా జరిగిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం గ్రామానికి చెందిన యువకులు ఏబీ ప్రధాన రహదారి రావిచంద్రి నుంచి చొర్లంగి గ్రామం వరకు మృతదేహాన్ని ర్యాలీగా తీసుకుని వెళ్లారు. మృతునికి తండ్రి, అమ్మ సుశీల, అక్క, తమ్ముడు ఉన్నారు.